క్లుప్తంగా

సచివాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



కొఠారు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసిన పెదపాడు మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్ తదితరులు

పెదపాడు: మండలంలోని గ్రామ సచివాలయల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేదిశగా అడుగులు వేయాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు సూచించారు. పెదపాడు మండలంలోని గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా నియమితులైన అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్ పెదపాడు కొ–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఏలూరు డివిజన్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

స్థల దాతలకు సత్కారం



సచివాలయ నిర్మాణానికి స్థలం దానం చేసిన దాతలు కామిరెడ్డి గాంధీ, కామిరెడ్డి బాలును సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

దెందులూరు: మండలంలోని శ్రీరామవరం గ్రామంలో సచివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కీర్తిశేషులు కామిరెడ్డి పట్టాభిరామయ్య, అమ్మాజీ జ్ఞాపకార్థం వారి కుమారులు కామిరెడ్డి గాంధీ, రాజేంద్రప్రసాద్, నాగభూషణం, కుమార్తె బొప్పన పుష్పలీల స్థలాన్ని దానం చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ స్థలం గ్రామ సర్పంచ్ కామిరెడ్డి నాని, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మోడల్ సచివాలయాన్ని నిర్మించారు. ప్రభుత్వానికి తమ వంతు సాయం అందించిన దాతలు గాంధీ, బాలును గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రశంసాపత్రాన్ని అందచేశారు.

ఉత్తమ వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్

మండలంలోని గోపన్నపాలెం గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణేష్‌కు గురువారం ఏలూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రశంసాపత్రాన్ని అందించారు.

ఏడు సార్లు ఉత్తమ ఎంపీడీఓగా రాజ్‌మనోజ్



కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపీడీవో

పెదవేగి : ఆయన పెదవేగి మండలపరిషత్ అభివృద్ధి అధికారి...అంతేకాదు ఆయనకు సంబంధించిన విధులను నూటికి నూరు శాతం అంకిత భావంతో నిర్వహించే నిరంతర సేవా తత్ప రుడు. పెదవేగి మండల అధికారులకు ఆయనొక ఆదర్శ ప్రాయు డు. మండల పరిధిలో ఉండే గృహ, తాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, రహదారులు, పంచాయతీల పరిపాలన అభివృద్ధి, సంక్షేమం, పారిశుధ్యం, అంగన్‌వాడీ వంటి బహుళ శాఖలపై అపార అవగాహన కలిగిన అధికారిగా పేరున్న పెదవేగి ఎంపీడీవో జి రాజ్ మనోజ్. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ ఎమ్పీడీవో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్‌ను పలువురు జిల్లా అధికారులు అభినందించారు.

ఊరూరా ఘనంగా గణతంత్ర వేడుకలు

- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో రెపరెపలాడిన త్రివర్ణ జెండా



భీమడోలు జూనియర్ సివిల్ కోర్టులో గణతంత్ర వేడుకల్లో జడ్జీలు, అధికారులు



భీమడోలు శాఖా గ్రంథాలయంలో జెండా ఆవశ్యకతను వివరిస్తున్న సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, తదితరులు



భోగాపురంలో జాతీయ పతకాన్ని సామాన్య పౌరులతో ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భీమడోలు: 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వాడవాడలా మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండా వేసి జాతీయ సమైక్యతా నినాదాన్ని చాటారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనమాల రామయ్య జెండాను ఆవిష్కరించారు. భీమడోలు శాఖా గ్రంథాలయం, గ్రామ పంచాయతీ, ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, వైస్ ఎంపీపీ మద్దుల ఫణిపద్మజ రాజాలు జెండాను ఎగుర వేసారు. భీమడోలులో జూనియర్ సివిల్ జడ్జి తల్లాప్రగడ అంజలి ఎస్ఎస్ రామాదిత్యరిషిక్ జెండా వందనం చేసారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా ప్రభుత్వ పాఠశాలల్లో జెండాను ఆవిష్కరించారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ షంషూద్దీన్ జెండాను ఎగుర వేసారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రకార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు ఆల్తి గోపి, అంబటి దేవీ ప్రసాద్, మండల మాన వత స్వచ్ఛంధ సేవా సంస్థ చైర్మన్ గుల్లా నూకరాజు, వార్డు సభ్యులు, న్యాయవాదులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిడమర్రులో: మండలంలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో మువ్వన్నెల జెండా ఆవిష్కరించి రాజ్యాంగాన్ని రూపొందించిన నేతలను కొనియాడారు. పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యాక్రమాలు, యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కోడే కాశి, సర్పంచ్ ముగ్గళ్ల యోకోబు, హెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీవీవీ ప్రకాష్,తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సాయిరాజు, మండల వనరుల కేంద్రంలో ఎంఈవో పుచ్చల శేషు జెండా ఎగుర వేసారు. బువ్వనపల్లి యూపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గణపవరం లైన్స్ క్లబ్ సభ్యులు విద్యార్థులకు బహుమతలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, హెచ్ఎం ఎస్. పెద్దిరాజు, లైన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

దెందులూరులో : గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. దెందులూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎండీపీఓ లక్ష్మి, ఎంఈఓ సీహెచ్ బుద్దావ్యాస్, ఎస్సై ఐ.వీర్రాజు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా , సోమవరప్పాడు బీఈడీ కళాశాలలో ఫాదర్ బాల, జోగన్నపాలెం మాకా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వలీవుల్లా జాతీయ పతాకాలను ఎగురవేశారు. పెరుగ్గూడెంలో గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని, సోమవరప్పాడులో సర్పంచ్ సరిగే నాగరాజు, గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్, గాలాయగూడెంలో చిలకా వెంకట సుబ్బారావు, ముప్పవరంలో సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్, పోతునూరులో సర్పంచ్ బోదుల స్వరూప్, సీతంపేటలో సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత జాతీయ జెండాను ఎగురవేశారు.



పెరుగ్గూడెంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి)



పెదనింద్రకొలనులో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి, విద్యార్థులు



గణపవరం పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై వేముల



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న యర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మిన శ్రీను, వ్యవసాయాధికారి ఏవో ప్రసాద్, గ్రామ కార్యదర్శి రాగూర్, భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ఉత్తమ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు

106 అడుగుల జాతీయ పతాకంతో నర్సింగ్ విద్యార్థుల ప్రదర్శన

దెందులూరు 9వ వార్డు సెంటరులో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులు 106 అడుగుల జాతీయ జెండాతో నర్సింగ్ కళాశాల, ఇంద్రవనం, 9వ వార్డు, ఇండియన్ బ్యాంక్ సెంటర్, లైబ్రరీ సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా నినాదాలు చేస్తూ జాతీయ పతాకాన్ని ప్రదర్శించి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ప్రజా ప్రతినిదులు, నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఉంగుటూరులో : ఉంగుటూరు మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యలయం వద్ద ఎంపీడీవో ప్రేమాన్విత జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఆరెండు కార్యాలయాలు సిబ్బంది, ఉద్యోగులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అలాగే నారాయణపురం ఎస్.ఎ.ఎస్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ విశేశ్వరరావు జాతీయ జెండాను ఎగురు వేశారు. క్రీడలు, సంస్కృతిక కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పెదవేగిలో : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పెదవేగి మండలం భోగాపురం వద్ద కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు తనయులు భాస్కర్ కావూరి నిర్మించిన భారీ పతాక స్థూపం వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతమాత చిత్రపటానికి సహవిభాగ్ ప్రచారక్ ఆర్. కొండ బాబు,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ వేదిక జిల్లా కార్యదర్శి యం.నాగరాజు, ఏలూరు నగర గ్రామీణ ఖండ ప్రచారక్ మహేశ్, అశోక్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రమ్ కిషోర్,జిల్లా ప్రధాన కార్యదర్శి కట్నేని లక్ష్మీ కృష్ణ ప్రసాద్,పిఆర్వో పులి శ్రీరాములు,రాజేష్ తదితరులు ఉన్నారు. పెదవేగి ఎంపీపీ తాతా రమ్య కుమార్ గాంధీ బొమ్మ సెంటర్, దళితవాడలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో, జాతీయ జెండా ఎగురవేసి పిల్లలకు మిఠాయి, పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మేకా లక్ష్మణరావు , పెదవేగి సొసైటీ ప్రెసిడెంట్ పెనుమాక సుబ్బారావు , మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ , పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనంతరం ఎంపీడీఓ ఆఫీస్ , పెదవేగి పీహెచ్‌సీ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెదవేగి మండలం పెదవేగి గ్రామంలోని తురాయి చెట్టు సెంటర్ వద్ద పెదవేగి మాజీ సర్పంచ్ తాతా గుత్యనారాయణ ఆధ్వర్యంలో పెదవేగి ఎంపీపీ తాతా రమ్య కుమార్ అధ్యక్షతన జాతిపిత బాపూజీ విగ్రహానికి, వైఎస్సార్ విగ్రహానికి నివాళ్ళులర్పించి, జాతీయ జెండా ఎగురవేసి స్వీట్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పెదవేగి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గిరాల్లో: సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల్లో 74వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్, దంత వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటర్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జి దేవి ఫాథర్ ఐ జాకబ్, దంత వైద్య కళాశాల నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, పీడీ నిట్టా నల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, రాజ్యాంగ ఔన్నత్యాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి విధి అని జిల్లా వ్యవసాయసలహాసంఘం ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం గ్రామగ్రామాన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, ఎమ్పీడీవో జ్యోతిర్మయి తదితరులు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్, సీఐ కార్యాలయం వద్ద సీఐ ఎంవిసుభాష్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై వేముల వెంకటేశ్వరరావు, డిగ్రీకాలేజి వద్ద ప్రిన్సిపల్ నిర్మలకుమారి, పిప్పర శాఖా గ్రంథాలయం వద్ద ఐవిరాజు, ఆయా గ్రామ పంచాయతీల వద్ద సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాల వద్ద కార్యదర్శులు పతాకావిష్కరణ చేశారు.

జిల్లా ఉత్తమ వ్యవసాయాధికారి ప్రసాద్

గణపవరం: జిల్లా ఉత్తమ వ్యవసాయ అధికారిగా గణపవరం మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ ఎంపికయ్యారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా గురువారం ఏలూరులో ఆయన జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ తదితర ఉన్నతాధికారుల సమక్షంలో అవార్డు అందుకున్నారు.

జిల్లా ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్న శ్రీనివాసరావు

భీమడోలు: దుద్దేపూడి సర్పంచ్ నీలం శ్రీనివాసరావు జిల్లా స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డును జిల్లా కలెక్టర్ ఎం.ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా గణతంత్ర వేడుకల పేరెడ్‌లో గురువారం అందుకున్నారు. అలాగే మండలంలోని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు, భీమడోలు గ్రామ కార్యదర్శి నందేటి రాగూర్‌లు ఉత్తమ సేవలందించినందులకు గాను గురువారం గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎం.ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా జిల్లా స్థాయిలో అవార్డులను అందుకున్నారు.

ఉంగుటూరు: యర్రమిల్లిపాడు గ్రామ సర్పంచ్ తమ్మినశ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



పోలసానిపల్లి నాడు నేడు పథకపు పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా

భీమడోలు: నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మునుపెన్నడూ లేని ప్రగతిని సాధిస్తున్నాయని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా అన్నారు. పోలసానిపల్లి నెం.2 ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నాడు నేడు పథకంలో రూ.16లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులకు గురువారం సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక చొరవచూపి పోలసానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు పాఠశాలలకు నాడు నేడు పథకం ద్వారా అభివృద్ధి పనులకు సుమారు రూ.50లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకున్నా దాఖాలాలే లేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పాఠశాలలకు మహర్దశ పట్టించారన్నారు. దీనితో పాఠశాలల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, వార్డు సభ్యులు భీమడోలు రామకృష్ణ, కోట శ్రీనివాసరావు, శ్రీనివాస్, హెచ్ఎం పీవీఆర్ మోహన్‌రావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు బువ్వనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: బువ్వనపల్లి గ్రామ సచివాలయం–1 పరిధిలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై గత మూడేళ్లలో ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు హాజరవ్వాలని ఆయన కోరారు.

ఉత్సవాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి



అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న పెదవేగి సీఐ ఎం. దుర్గాప్రసాద్, దెందులూరు ఎస్సై వీర్రాజు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మపేరంటాల ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పెదవేగి సీఐ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం అమ్మవారి ఆలయ ఆవరణలో ఎస్సై వీర్రాజు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 నుంచి జరిగే ఉత్సవాల్లో చివరి రోజు వరకు తాము పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పగలు, రాత్రివేళల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు కూడా గ్రామంలోని యువతీ ద్వారా పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ముఖ్యంగా కరోనా జాగ్రత్తలను పాటించాల్సిందిగా మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు తెలియచేయాలన్నారు. ఎటువంటి అవసరం ఉన్నా, అవాంచనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు తెలియచేయాలన్నారు.

మక్కిన వారిగూడెంలో వైద్యశిబిరం



మక్కినవారిగూడెంలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న చక్రవర్తి, తదితరులు

టి.నరసాపురం: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మేలని మక్కినవారిగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. మక్కినవారిగూడెం సొసైటీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రామకృష్ణ, సర్పంచ్ మెతుకుమిల్లి గోపాలరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నిడమర్రు: సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల కన్నబాబు తెలిపారు. గురువారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అధ్యక్షతన మండలలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసీపీ ముఖ్య నేతలతో భవిష్యత్ కార్యాచరణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగనన్న సచివాలయాల మండల బాధ్యులు నౌడు వెంకట అచ్యుత రామారావు మాట్లాడుతూ గ్రామ వలంటీర్లుకు సమాంతరంగా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు గ్రామ సచివాలయాల కన్వీనర్లు గృహ సారథులు పనిచేయాలన్నారు. జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ ఎన్నికలు వచ్చే నాటికి నూరుశాతం ఫలితాలు వైసీపీకి అనుకూలంగా సాధించేలా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సమయం వీరరాఘవులు, బండిరమణవిస్సాకు, మండల సర్పంచ్ చాబర్స్ అధక్షులు పుప్పాల మెహర్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను తదితర సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



వివిధ విభాగాల సచివాలయ ఉద్యోగులకు ప్రశంసాపత్రంతో సత్కరిస్తున్న ఎంపీపీ

పెదవేగి : ప్రజలకు సేవచేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన సచివాలయ ఉద్యోగుల ప్రతిభకు పురస్కారాలతో సత్కరించిందని పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్ అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెదవేగి మహిళా పోలీస్ ఎం జ్యోతి, వేగివాడ సచివాలయ ఏఎన్ఎం యు జ్యోతి, అంకన్నగూడెం మహిళా పోలీస్ ఎం అనుపమ, వేగివాడ వెటర్నరీ కె మణికంఠ, చక్రాయిగూడెం గ్రేడ్-5 కార్యదర్శి చంద్రశేఖర్, పెదవేగి పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, ఏఓ జాన్సన్‌లకు ఎంపీపీ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలను అందించారు. అనంతరం ముండూరు సచివాలయ సర్వేయర్ గా పనిచేస్తున్న బాలిన మోహన్ కుమార్ ను పెదవేగిలో తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు చేతులమీదుగా ఉత్తమ సర్వేయర్ గా అవార్డ్ ను, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పెదవేగి మండల సర్వేయర్ సత్యనారాయణమూర్తి, ముండూరు, చక్రాయిగూడెం సర్వేయర్‌లు పాల్గొన్నారు.